

విలువైన వజ్రం లభ్యం

తుగ్గలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువచింతల కొండలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ కూలీకి సోమవారం విలువైన వజ్రం దొరికింది. దీంతో చెన్నంపల్లికి చెందిన వజ్రాల వ్యాపారి రూ.13.50లక్షలకు ఈ వజ్రాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినప్పుడు జొన్నగిరి, పగిడిరాయి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి గ్రామాల్లో వజ్రాలు లభ్యమవుతుంటాయి. వజ్రాల కోసం ఇతర ప్రాంతాలకు చెందిన వారు రాకూడదని రైతులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో మాదిరిగా ఎల్‌ఆర్‌ఎస్ (అన్ అప్రూవ్డ్ లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంతో తాజాగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వేసిన అనధికార లేఅవుట్లకు ఈ స్కీమ్‌ను వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ప్లాను లేకుండా నిర్మాణాలు చేసుకున్న నిర్మాణదారులకు లబ్ధి చేకూరనుంది. నిజానికి గతంలో టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు క్రమబద్ధీకరణను అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ స్కీమ్‌లను పొడిగించకుండా రద్దు చేయడంతో ఐదేళ్లుగా నిర్మాణదారులు తమ నిర్మాణాలను క్రమబద్ధీంచుకొనే అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు .ప్లాను మంజూరుకు అవకాశం లేని నిర్మాణాలు పట్టణ పరిధిలో అనేకంగా ఉన్నాయి.

-ఆదోని టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి)



నిర్మాణదారులకు భారీ ఊరట..!



శివారు ప్రాతంలో నాన్ లే-అవుట్ ప్లాట్లలోని నిర్మాణాలు

- రియల్ ఎస్టేట్‌కు ఊతం
- అనధికార నిర్మాణాలు, నాన్ లే-అవుట్ ప్లాట్‌లకు క్రమబద్ధీకరణ
- చాలా కాలంగా ఎదురు చూస్తున్న నిర్మాణదారులు
- ఎల్‌ఆర్‌ఎస్ మార్గదర్శకాలు జారీ
- వైసీపీ హయాంలో అనుమతులు నిరాకరణ
- సవరించిన కూటమి ప్రభుత్వం

నిర్మాణ రంగానికి ఊతం

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగానికి భారీ ఊరట లభించినట్లయింది. అనధికార లేఅవుట్‌లలో స్థలాల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించింది. స్థల రిజిస్ట్రేషన్ విలువలో నిర్ణీత రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన నిబంధనలను ఎత్తివేసింది. నాన్ లేఅవుట్‌లో ప్లాట్ కొనుగోలు చేసుకుంటే క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. మొత్తం లేఅవుట్‌ను గుర్తించాలని మున్సిపాలిటీలకు దిశానిర్దేశం చేసింది. ఆ తర్వాతే అందులో ఉన్న ప్లాట్‌లను క్రమబద్ధీకరించేలా నిబంధన పెట్టింది. ఫలితంగా 2020లో అమలు చేసిన లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవడానికి నిర్మాణదారులు వెనుకంజ వేశారు. ప్రతి మున్సిపాలిటీలోనూ కొద్దిమంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వాటిని క్రమబద్ధీకరించలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగానే ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగిసిపోయింది. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పెండింగ్ దరఖాస్తులను ప్రస్తావించింది. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని దిశానిర్దేశం చేసింది. అయితే అప్పట్లో నిర్ణీత రుసుం చెల్లించిన వారికే వర్తిస్తుంది. లేదంటే కొత్తగా విధించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది.



బీపీఎస్ కోసం ఎదురు చూస్తున్న నిర్మాణాలు

నాన్ లే అవుట్‌కు గడువు

ప్రభుత్వం నాన్ లేఅవుట్ అయినా, లేఅవుట్ అయినా ప్లాట్ల క్రమబద్ధీకరణపై గడువు విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2025 జూలై 30 నాటికి ఉన్న లేఅవుట్‌లనే పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. అంటే అప్పటికే లే అవుట్‌లోని ఒక ప్లాట్ అయినా విక్రయించాలి. అప్పుడే అందులోని ఇతర ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. లేదంటే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు నిబంధనలు వర్తించవు. ఇటీవలి కాలంలో పట్టణాల్లో నాన్ లేఅవుట్‌లు అధికంగా పుట్టుకొచ్చాయి. వాటిపైనే రిజిస్ట్రేషన్లు కూడా అవుతున్నాయి. కొన్నింటిని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చేస్తున్నారు. విక్రయాలు జరగడం లేదు. వీటికి మాత్రం ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు వర్తించే అవకాశం లేదు.

ఇక నాన్ లే-అవుట్ ప్లాట్లకు డిమాండ్

వైసీపీ హయంలో ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను రద్దు చేయడంతో నాన్‌లే-అవుట్ ప్లాట్లలో చిన్న నిర్మాణాలకు ప్లాన్ మంజూరు కోసం రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల దాకా ఫీజులు చెల్లించాల్సి రావడంలో చాలా మంది యాజమానులు ఇళ్ల నిర్మాణాల కోసం ముందుకు రాలేదు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో నాన్ లే-అవుట్ ప్లాట్లకు డిమాండ్ పడిపోయి వాటి ధరలు కూడా బాగా పడి పోయాయి. ప్రభుత్వం తిరిగి ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో నాన్ లే-అవుట్ ప్లాట్లలో నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్లాట్ల ధరలు కూడా పెరిగే అవకాశం కలిగింది.



మిగతా 7లో

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

- కలెక్టర్ రంజిత్‌బాషా



విభిన్న ప్రతిభావంతులకు డైసీ మెషిన్‌ను అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిపూర్ణ అధ్యయన సాధనంతో పూర్తిగా మాట్లాడే పాకెట్ లైబ్రరీ (డైసీ మెషిన్)ను కలెక్టర్ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల జిల్లా కోఆర్డినేటర్ లాగిన్‌లో వారం రోజులు, డీఎస్‌డీవో లాగిన్‌లో 13 రోజుల నుంచి అర్జీలు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కర్నూలు లాగిన్‌లో 11 రోజులు, కర్నూలు అర్బన్ తహసీల్దార్ లాగిన్‌లో వారం రోజుల నుంచి ఒక అర్జీ, ఆదోని సబ్ రిజిస్ట్రార్ లాగిన్‌లో వారం రోజుల నుంచి అర్జీలు చూడకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 13, పత్తికొండ ఆర్డీవో వద్ద 6, కర్నూలు ఆర్డీవో వద్ద 7, సర్వే ఏడీ, డీఎస్‌డీవో, కర్నూలు మున్సిపల్ కమిషనర్, డీఆర్‌డీఏ పీడీ, హౌసింగ్ పీడీ, మెప్మా పీడీ, ఇరిగేషన్ ఎస్ఈ, వక్ఫ్‌బోర్డుల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ డా.బి. నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొగాకు రైతుల నిరసన



కలెక్టరేట్ ముందు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు, రైతు సంఘాల నాయకులు

- కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన

కర్నూలు అగ్రికల్చర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని పొగాకు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతుసంఘం నాయకులతో పాటు పొగాకు రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొగాకును కొనేవారు లేక ఇళ్లల్లో, కల్లాల్లో నిల్వ చేసుకునే అవకాశం లేక వర్షానికి తడిసి తీవ్రంగా నష్టపోతున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు నిల్వలను కంపెనీలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు కంపెనీల యజమానులపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. ఎమ్మిగనూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు, కర్నూలు, కల్లూరు మండలాల్లో ఇప్పటికీ పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేయకపోవడం వల్ల ఆ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల యజమానులు కొనుగోలు చేయకపోవడం వల్ల దళారులు రైతుల వద్దకు వెళ్లి క్వింటా పొగాకును రూ.800 నుంచి రూ.5వేల లోపే కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారన్నారు. దీని వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుందన్నారు. అనంతరం రైతు సంఘం ప్రతినిధులు, రైతులతో కలిసి కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సహాయ కార్యదర్శులు కృష్ణ, కోటకొండ సూరి, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు పాల్గొన్నారు.



జలాశయాలు కళకళ

- శ్రీశైలానికి పోటెత్తిన వరద
- నదితీర గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ

7

రతనాల సీమగా మారుస్తాం

- స్థానికసంస్థల ఎన్నికలో బీజేపీ జెండా ఎగురవేస్తాం
- ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ మాధవ్
- నంద్యాలలో భారీ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్

నంద్యాల కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ మాధవ్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల సౌజన్య ఫంక్షన్‌హాలులో జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ముందుగా పార్టీ కార్యాలయం చేరుకొని సీనియర్ కార్యకర్తలను సన్మానించారు. పద్మావతీనగర్ నుంచి వైజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సౌజన్య ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన సమావేశంలో మాధవ్ మాట్లాడారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరలో పూర్తిచేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ నంద్యాల జిల్లాను స్పిరుచువల్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నారు. కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాయకుడు మాధవ్ అని ఎమ్మెల్యే పార్థసారధి కొనియాడారు.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వేరుశనగ దిగుబడులతో కళకళ



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సోమవారం భారీగా విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులతో కళకళలాడింది. ఏ ప్లాట్‌ఫాం చూసిన వేరుశనగ దిగుబడులే కనిపించాయి. వేసవికాలం బోరు బావులు కింద, కాలువల కింద సాగైన వేరుశనగ దిగుబడులు చేతికందడంతో రైతులు విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 4,394 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.3,851, గరిష్ఠ ధర రూ.6,767, సగటున రూ.6,009 పలికింది.

నేడు కర్నూలులో మాధవ్ పర్యటన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం కర్నూలులో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మాధవ్ రాయలసీమ పర్యటనలో భాగంగా కర్నూలులో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. 28వ తేదీ రాత్రి 9గంటలకు నంద్యాల నుంచి కర్నూలుకు చేరుకొని మౌర్యఇన్ హోటల్‌లో రాత్రి బసచేస్తారని వివరించారు. 29వ తేదీ ఉదయం 6 గంటల నుంచే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 6గంటలకు అనంతపురానికి బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



నల్లమలలో డేంజర్ బెల్స్..!

ఎన్‌ఎస్‌టీఆర్‌లో పులుల గణాంకాలను పరిశీలిస్తే..

నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు ప్రతి నాలుగేళ్లకు ఓసారి దేశంలో పులులను లెక్కిస్తారు. అదేక్రమంలో గత కొన్నేళ్లుగా ప్రతిఏటా ఫేస్-4 ప్రక్రియ కింద నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్‌ఎస్‌టీఆర్) పరిధిలో పెద్దపులులతో సహా ఇతర వన్యప్రాణుల గణాంకాలను లెక్కిస్తారు. ఆయా గణాంకాల ప్రకారం ఉమ్మడి ఏపీలోని ఎన్‌ఎస్‌టీఆర్‌లో 2006 గణాంకాల ప్రకారం 95 పెద్దపులులు ఉన్నట్లు అంచనా వేశారు. 2010లో వాటి సంఖ్య 72కు పడిపోయింది. ఆ తర్వాత 2014లో చేపట్టిన పులుల గణాంకాల్లో 68కి చేరింది.

మిగతా 6వ పేజీలో

- ఫేస్-4 గణాంకాల్లో తగ్గిన పులుల సంఖ్య..?
- ఎన్‌ఎస్‌టీఆర్‌లో కొరవడిన పర్యవేక్షణ
- పులుల మరణాలు జరుగుతున్నా చర్యలు శూన్యం
- రేంజర్ల పనితీరుపై విమర్శలు
- నేడు వరల్డ్ టైగర్స్ డే

నల్లమలలో పెద్దపులులకు ముప్పు ముంచుకొస్తోంది. కొన్నేళ్లుగా నల్లమలలో పెద్దపులుల సంతతి ఆశాజనంగా ఉన్నప్పటికీ ఈ ఏడాది ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే.. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో పర్యవేక్షణ లోపించడంతో పాటు ఇటీవల కాలంలో నల్లమలలో వేటగాళ్ల సంచారం అధికమైనట్లు విమర్శలు ఉన్నాయి. పైగా విధుల్లో అలసత్వం వహించే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు లేకపోవడంతో చివరికి పులుల మనుగడకే ప్రమాదం వాటిల్లుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రతిఏటా జూలై 29వ తేదీన వరల్డ్ టైగర్స్ డే నిర్వహిస్తారు. వాస్తవానికి 2010లో తొలిసారిగా వరల్డ్ టైగర్స్ డేను జరిపి అప్పటి పులుల సంఖ్యను 2022 నాటికి రెట్టింపు చేయాలని పూనుకున్నారు. అయితే దేశంలో పులుల వృద్ధిరేటు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికి నల్లమలలో మాత్రం పులుల సంఖ్య ఆశాజనంగా మారింది. పలు సందర్భాల్లో నల్లమలలో పులుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ గడిచిన ఏడేళ్లుగా పులుల సంఖ్యలో వృద్ధి కనిపించింది. దేశంలోనే పులుల వృద్ధిరేట్ తగ్గుముఖం పట్టినా.. నల్లమలలో మాత్రం ఊపందుకుంది. కానీ.. ఈ ఏడాది జరిపిన ఫేస్-4 గణాంకాల్లో పులుల సంఖ్య క్షీణించడం ఆందోళనకు గురిచేస్తోంది.

-ఆత్మకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి)

నల్లమలలో డేంజర్ బెల్స్..!

(5వ పేజీ తరువాయి)

ఈలెక్కన 8ఏళ్లలో 27పులుల క్షీణించాయి. ఆతర్వాత 2018 గణాంకాల ప్రకారం ఉమ్మడి ఏపీలో 74 పులులు ఉన్నట్లు అంచనా వేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో 48 పులులు ఉన్నట్లు అంచనా వేయగా, తెలంగాణలోని అమ్రాబాద్, కవాల్ అభయారణ్యాల పరిధిలో 26 పులులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో కలాల్‌లో నాలుగైదు పులులు ఉండగా మిగిలిన పులుల అమ్రాబాద్ అభయారణ్యం పరిధిలోని నల్లమల అడవుల్లోనే ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని ప్రాథమికంగా గుర్తించారు. ఆతర్వాత 2022 గణాంకాల ప్రకారం ఏపీలోని ఎస్ఎస్‌టీఆర్‌లో 73 ఉండగా, తెలంగాణలో మరో 35ఉన్నట్లు తెలుస్తోంది.

రేంజర్ల పనితీరుపై విమర్శలు

గతంలో ఎస్ఎస్‌టీఆర్ పరిధిలో పనిచేసిన కొంతమంది డీఎఫ్ఓలు విధుల్లో కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో నల్లమలలో గస్తీ పెరిగి పులుల సంరక్షణ కూడా సజావుగా ఉండేది. అయితే గత కొన్నేళ్లుగా అటవీ ఉద్యోగుల విధినిర్వహణలో అలసత్వం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఒకప్పుడు రేంజర్ స్థాయి అధికారులు కింది స్థాయి సిబ్బందిని వెంట పెట్టుకుని కమాండర్ జీపుల్లో అటవీ ప్రాంతాల్లోని మారుమూల ప్రాంతాలకు రాత్రిళ్లు సైతం వెళ్లి గస్తీ చేసేవారు. కానీ.. ప్రస్తుతం చాలామంది రేంజర్లు ఆతరహా విధులకు దూరమైనట్లు తెలుస్తోంది. దీనికితోడు కింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం లేకుండా బాసిజాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ఆక్రమంలోనే మరికొంత మంది రేంజర్లు అటవీ రక్షణ మరిచి కార్యాలయాలకే పరిమితమవుతున్నట్లు తెలిసింది. కేవలం అడవుల్లో జరిగే వివిధ సివిల్ వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు.. బినామీ కాంట్రాక్టర్లను వారే నియమించి వర్క్‌ల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఫారెస్ట్ చెక్‌పోస్టుల నిర్వహణ పేరుతో మరికొంత మంది ఉద్యోగులు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు ఉన్నాయి. అదేక్రమంలో అటవీ శాఖగా సమృద్ధిగా ఉద్యోగుల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అరకొర నియామకాల వల్ల అటవీ, వన్యప్రాణి సంరక్షణ సజావుగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఇటీవల కొంతమంది రేంజర్లు బదిలీ కావడంతో వారి స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. ఈ నెల చివరన మరో రేంజర్ రిటైర్డు కాబోతున్నారు. అయినప్పటికీ రేంజర్ల నియామకంలో ఉన్నతాధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.



నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ (ఫైల్)

నల్లమలలో తగ్గిన పులుల సంఖ్య?

నల్లమలలోని ఎస్ఎస్‌టీఆర్ పరిధిలో ఇటీవల చేపట్టిన ఫేస్-4 గణాంకాల ప్రకారం ఈ ఏడాది పులుల సంఖ్య క్షీణించినట్లు తెలిసింది. వాస్తవానికి 2023-24 సంవత్సరానికి సంబంధించి ఫేస్-4 పులుల కనీస గణాంకాలను జూలై 29వ తేదీన డిప్యూటీ సీఎం, రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. దీనిప్రకారం ఎస్ఎస్‌టీఆర్‌లో 76 పెద్దపులులు, 11 పులికూనలతో కలిపి మొత్తం 87 పులులు ఉన్నట్లు అంచనా వేశారు. కానీ ఈ ఏడాది చేపట్టిన ఫేస్-4 గణాంకాల్లో 70కంటే పులులు తక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం అటవీశాఖను మరింత ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ వివరాలు మంగళవారం జరిగే వరల్డ్ టైగర్స్ డే రోజున వెల్లడిస్తారో లేదో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా పులుల సంఖ్య క్షీణించడం పట్ల అసలు గణాంకాల లెక్కింపు సరిగ్గా జరగలేదా..? లేకా పెద్దపులులు నిజంగానే మరణించాయా..? లేక ఆవలి తెలంగాణ పరిధిలోని అడవుల్లోకి వలస వెళ్లాయా..? అనే కోణాల్లో అటవీ శాఖ ఆలోచనలో పడినట్లు తెలిసింది.



కలవరపెడుతున్న ఘటనలు

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో మూడేళ్ల వ్యవధిలో చోటుచేసుకున్న పెద్దపులుల మరణాలు అటవీశాఖను ఉలికిపాటుకు గురిచేస్తోంది. ఈ వివరాలను పరిశీలిస్తే..

- 2022 మే 11వ తేదీన ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్, పెద్దఅనంతాపురం సెక్షన్, పీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో ఓ పెద్దపులి (టీ-94) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు సుమారు 20రోజుల తర్వాత అటవీ అధికారులు గుర్తించారు.. అయితే ఇది ఆవాస మార్పు కారణంగా మరో పులితో జరిగిన భీకర పోరులో సహజసిద్ధంగా మరణించినట్లు అప్పట్లో అటవీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్దపులి నమూనాలను ల్యాబ్‌కు పంపించిన వాస్తవానికి తెలియజేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ వివరాలను వెల్లడించలేదు.
- 2022 ఆగస్టు 9న వెలుగోడు రేంజ్‌లోని నార్త్‌బీట్ పరిధిలో ఉన్న గుండ్లమల్లెలమ్మ బేస్‌క్యాంపు సమీపంలో వెలుగోడు జలాశయం బ్యాక్‌వాటర్ ప్రదేశంలోని బుడగలవాగులో ఓ పెద్దపులి (టీ-48) కళేబరాన్ని అటవీ అధికారులు గుర్తించారు. అయితే ఆ పులికి మెడ చుట్టూ క్లచ్‌వైర్ ఉచ్చు ఉండటంతో తీవ్ర గాయమై రక్తస్రావం, చీము పట్టి మృతిచెందింది.
- 2023 మార్చి 6వ తేదీన నల్లమల అడవి నుంచి నాలుగు ఆడ పులికూనలు దారితప్పి కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం ఊళ్లోకి చేరాయి. గ్రామస్థులు ఆ పులికూనలను గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు తల్లిపులి (టీ-108) ఆచూకీ కోసం అటవీ అధికారులు నాలుగు రోజుల పాటు అనేక విధాలుగా అన్వేషించినప్పటికీ ఆచూకీ లభించలేదు. చివరకు మార్చి 10వ తేదీన ఆ పులికూలను తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు తరలించారు. ఈ ఘటన అప్పట్లోనే దేశంలోనే సంచలనం రేకెత్తించింది. అప్పట్లో తల్లి పులి క్షేమంగానే ఉందని అటవీ అధికారులు చెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు.
- ఆత్మకూరు రేంజ్, ముసలిమడుగు సెక్షన్, గుమ్మడాపురం బీట్ పరిధిలో గల దేవరసెల వద్ద 2023 ఏప్రిల్ 30న ఓ పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. అయితే మృతికి గల కారణాలపై అటవీ అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. పెద్దపులి శరీర అవయవాలను సేకరించి సీసీఎంబీ హైదరాబాద్‌కు పంపించారే తప్ప రిపోర్టు వివరాలను వెల్లడించలేదు.
- ఆత్మకూరు రేంజ్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్ సందుబాటు రస్తాలో ఓ పెద్దపులి బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు నడుముకు చిక్కుకుని తీవ్రంగా గాయపడిన విషయాన్ని 2024 ఫిబ్రవరి 25వ తేదీన అటవీ అధికారులు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఆతర్వాత మార్చి 5వ తేదీన రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పులిని బంధించి బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో వారం రోజుల పాటు సపర్యలు చేసి తిరిగి అడవిలో వదిలేశారు. కొన్నిరోజులకు ఆ పులి కూడా మరణించింది.
- ఈక్రమంలోనే 2025 మే 20వ తేదీన బైర్లూటి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి ఉచ్చు నుంచి తప్పించుకుని గాయపడినట్లు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొని ఎట్టకేలకు జూన్ 5వ తేదీన పెద్దపులిని బంధించి వైద్యపరీక్షలు నిర్వహించారు. గాయం పెద్దది కావడంతో తిరుపతి జూపార్క్‌కు తరలించి అక్కడే సపర్యలు చేస్తున్నారు.



2022 మే 11వ తేదీన పీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో లభ్యమైన పెద్దపులి కళేబరం

పీఎం మోదీని కలిసిన ఎంపీ శబరి



మోదీకి ఆంజనేయస్వామి విగ్రహాన్ని అందిస్తున్న శబరి, శివచరణ్

నంద్యాల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలోని పీఎం ఛాంబర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నంద్యాల పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించి అభివృద్ధికి తోడ్పడాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. నంద్యాల పార్లమెంట్‌కు కేటాయించిన, కేటాయించాల్సిన ఎంపీ నిధులపై చర్చించినట్లు వివరించారు. మోదీకి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని బహూకరించారు.

పరిశ్రమలు స్థాపిస్తే చేయూతనిస్తాం

- జిల్లాలో మెరుగైన అవకాశాలు
- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు వస్తే చేయూతనిస్తామని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. నంద్యాల పీజీఆర్ఎస్ హాల్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ (ర్యాంప్) కార్యక్రమంపై కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంప్ కార్యక్రమం ద్వారా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వివిధ మండలాల్లో క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 30న నంద్యాలలో, ఆగస్టు 6న డోన్‌లో, 12న నంద్యాల మండలంలో, 13న ఆళ్లగడ్డలో, 19న బనగానపల్లెలో, 20న నందికొట్కూరులో, 26న పాణ్యంలో, 28న బేతంచర్లలో, సెప్టెంబర్ 3న డోన్‌లో, 9న ఆళ్లగడ్డలో, 10న ఆత్మకూరులో, 16న నంద్యాలలో, 17న కొలిమిగుండ్లలో, 18న బనగానపల్లెలో, 24న బేతంచర్లలో, 25న పాణ్యం మండలాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమాలకు ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇంజ నీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు, హార్టి కల్చర్ సిబ్బందిని పాల్గొనే చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయ ని అన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో విజిలెన్స్ కమిషనర్



శ్రీశైలం చేరుకున్న విజిలెన్స్ కమిషనర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామిని సోమవారం విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్రపునేఠ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న విజిలెన్స్ కమిషనర్‌కు ఆలయ ఈవో శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. విజిలెన్స్ కమిషనర్ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని

- తన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన వీరస్వామి రూ.8లక్షలు, 5 తులాల బంగారం తీసుకుని మోసం చేశాడని రాధాకృష్ణ వీధికి చెందిన వి.నాగరాజు ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన హెప్సిబా సునీలా కరుణాసాగర్, ఎలిజబెత్ పాస్టర్లుగా పని చేస్తూ మార్కెట్ మాస్టర్ అనే యాప్ పేరు చెప్పి చాలా మందిని మోసం చేసినట్లు బాధితులు వాపోయారు. అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని గ్రూపులు చేసి ప్రతి ఆదివారం జూమ్ మీటింగ్ తీసుకుంటూ 578మంది నుంచి రూ.4కోట్ల వరకు మోసం చేసి తీసుకున్నారు. డబ్బులివ్వకుండా మార్కెట్ మాస్టర్ యాప్ బ్లాక్ అయింది. మోసం పోయామని భావించిన కర్నూలు చెందిన కళ్యాణి, గౌతమి, రాజేశ్వరి, పద్మ, పద్మావతి, నాగరాజు, విజయభాస్కర్, తాయన్నతో పాటు పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- తన పొలానికి రస్తా ఇవ్వకుండా రైతు గొల్ల నాగప్ప అడ్డుపడుతున్నాడని, తనకు న్యాయం చేయాలని కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన జి.రాముడు ఫిర్యాదు చేశారు.
- వెల్దుర్తికి చెందిన ప్రశాంత్‌బాబు ఢిల్లీలో అనురాగ్ అనే వ్యక్తితో తనకు పరిచయం ఉందని, రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జాబ్ ఇప్పిస్తామని రూ.12.50లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు శ్రీనగర్ కాలనీకి చెందిన రవిబాబు ఫిర్యాదు చేశారు.
- పంచలింగాల దగ్గర ఉన్న తన వ్యవసాయ భూమిలో ఉన్న 10 టేకు చెట్లను విద్యుత్ శాఖ అధికారులు అనుమతులు లేకుండా తొలగించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి చెందిన మాధవరాజు ఫిర్యాదు చేశారు.
- ఐటీ కన్సల్టెన్సీ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన షణ్ముక్ సుదర్శన్ అనే వ్యక్తి రూ.4లక్షలు తీసుకుని మోసం చేశాడని జోహరాపురం గ్రామానికి చెందిన గుణశేఖర్ ఫిర్యాదు చేశారు.



ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



హాజరైన మార్గదర్శకులు

పీ-4తో పేదరిక నిర్మూలన

- 22 వేల కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు
- కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానం అమలు చేస్తోందని, అందులో భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో పీ-4 విధానం అమలుపై విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులతో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం పుణ్యకార్యమని, ఈ అవకాశం పీ4 విధానం ద్వారా లభిస్తోందన్నారు. మనం చేసే చిన్న సాయం అవసరంలో ఉన్న కుటుంబానికి ఎంతో ఆసరా ఇస్తుందని, సమాజంలో సాయం చేయగలిగిన సామర్థ్యం ఉన్నవారు మానవతా కోణంలో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పీ-4 కార్యక్రమాన్ని మార్చి 30వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభించడం జరిగిందని, ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలో 15 లక్షల మంది బంగారు కుటుంబాల దత్తతను లక్ష్యంగా నిర్ణయించారనీ తెలిపారు. జిల్లాలో సర్వే చేసి 64వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. పీ-4 పాలసీకి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోనీ సీపీవో కార్యాలయంలో 9440758201, 9441174933, 8125367303 నెంబర్లను సంప్రదించాలని అన్నారు. అదేవిధంగా ఎంపీడీవోలను సంప్రదించవచ్చని పీ-4 మార్గదర్శిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే Https://zeropovertyp4.ap.gov.in/ వెబ్‌సైట్ పోర్టల్‌ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉల్లి నాటుకు రైతు పాట్లు



స్ప్రింకర్స్‌తో ఉల్లికి నీటితడులు అందిస్తున్న దృశ్యం

కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ఓ రైతు ఉల్లినాటును బతికించుకునేందుకు చేసిన ప్రయత్నం ఇది. సరైన వాన లేక అరపదునులోనే ఈ గ్రామ రైతులు ఉల్లి నాటుకు దిగారు. ఉల్లినారు చేతికందడంతో వర్షం రాక పోతుందా అనే మొండి ధైర్యంతో ముందడుగు వేశారు. పదిరోజుల క్రితం అడపాదడపా కురిసిన చిన్నపాటి జల్లులకు ఇక్కడి నల్లరేగడి పొలాల్లో జోరుగా ఉల్లినాట్లు వేస్తున్నారు. అయితే నాటు వేసిన అనంతరం వర్షం జాడ లేదు. వారం రోజులకు పైగా వర్షం కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప వాన పడడం లేదు. దీంతో వెంకటగిరికి చెందిన బీవై గిడ్డయ్య అనే రైతు బాడుగకు స్ప్రింక్లర్లను తెచ్చి ఎకరన్నర పొలానికి తడి అందించాడు. సుమారు 40 పైపులను ఏర్పాటు చేసి నీటిని తరలించాడు. పొలంలో పైపులను మార్చడానికి ముగ్గురు కూలీలను ఉంచాడు. ఉల్లినాటును బతికించుకోవడానికి తప్పనిపరిస్థితి అని ఆ రైతు పేర్కొన్నాడు.

- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఉరుకుంద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ఎల్లెల్సీలో స్నానాలు చేస్తున్న భక్తులు

కౌతాళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం ఉరుకుంద క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి అలంకరణ చేశారు. భక్తులు ఎల్లెల్సీ కాలువలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో విజయరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

మంత్రాలయంలో ఉధృతంగా తుంగభద్ర ప్రవాహం

- గంగమ్మ గుడిని తాకిన వరద
- తీర ప్రాంతాల్లో అధికారుల హెచ్చరిక



మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది మంత్రాలయంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. హోస్పేట్‌లోని టీబీ డ్యాం నుంచి 27 గేట్లను ఎత్తి 1,19,553 క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద సోమవారం సాయంత్రం 310.84 మీటర్ల నీటి మట్టంతో 92,250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో నది ఒడ్డున ఉన్న గంగమ్మ గుడిని వరద చుట్టుముట్టింది. దీంతో తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ శివాంజల్, రెవెన్యూ అధికారులు జయరామిరెడ్డి, జనార్ధన్ రావు, భీమయ్యలు నది తీరాన్ని పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్,ఏఈ బద్రినాథ్ భక్తులకు ఇబ్బందులకు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నది ఒడ్డున ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ, గజ ఈతగాళ్లతో పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

టీజీవీ కళాక్షేత్రానికి నాలుగు జాతీయ బహుమతులు

తిరుపతి అభినయ ఆర్ట్స్ పోటీల్లో రాణించిన కళాకారులు



జ్ఞాపిక, నగదు పురస్కారం స్వీకరిస్తున్న నాటక దర్శకుడు కళారత్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కేంద్రంలోని అభినయ ఆర్ట్స్ సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు సత్తా చాటారు. ఈనెల 20 నుంచి 27 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' పద్య నాటకానికి నాలుగు జాతీయ బహుమతులు లభించాయి. ఈ నాటకానికి ఉత్తమ జ్యూరీ అవార్డుతోపాటు ఉత్తమ కథానాయకిగా సురభి ప్రభావతి, ఉత్తమ హాస్య నటి హసీనా, ఉత్తమ ఆహార్యం(మేకప్) సి.శ్రీనివాసులుకు బహుమతులు లభించినట్లు నాటక దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. జాతీయ బహుమతులు సాధించిన కళాకారులను టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యవర్గ సభ్యులతోపాటూ ఇతర కళాకారులు అభినందించారు.

నిర్మాణదారులకు భారీ ఊరట..!

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు ఇవీ..

- ఎస్ఆర్ఎస్ స్కీంలో భాగంగా 2025 జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్)కు అవకాశం ఉంటుంది.
- ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ కోసం 90 రోజులు గడువు ఉంటుంది.
- ప్రతి ప్లాట్‌కు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని ఉండాలి.
- ప్లాట్ విక్రయం తేదీ 30-06-2025లోపు అయి ఉండాలి.
- ప్లాట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ చార్జీలు ఉంటాయి.
- 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14 శాతం అదనపు చార్జీలు విధిస్తారు.
- పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కూడా అవకాశం ఉంటుంది.
- ఇందుకు సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి రానుంది.
- ఈ స్కీమ్ అమలు ద్వారా అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న నగర, పట్టణ, కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఆయా పథకాల ద్వారా వివిధ నిర్మాణాలు, లేఅవుట్‌లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రయోజనాలెన్నో..

- అనధికార లేఅవుట్‌లో ప్లాట్లను క్రమబద్ధీకరిస్తే మున్సిపాలిటీ నుంచి ముఖ్యమైన ఎల్పీ నంబర్ వస్తుంది.
- నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ప్లాన్ మంజూరు చేస్తారు. ప్లాన్ ఉంటే బ్యాంకులు రుణ సౌకర్యాన్ని కల్పిస్తాయి. ప్లాట్ యజమానులకు ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు.
- రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు నిర్మాణాలు జోరందుకుంటాయి. కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పనులు దొరుకుతాయి.
- క్రయ, విక్రయాలు చేసుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి.
- భవన నిర్మాణాలకు సునాయసంగా అనుమతులు లభిస్తాయి.

చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం



క్రమబద్ధీకరణకు అవకాశం లేకపోడంతో అక్రమ నిర్మాణాలపై బ్యాంకుల్లో రుణాలు లభించడం లేదు. కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ను అమలు చేస్తే చాలా మందికి ప్రయోజనం కలుగుతుంది. అపరాధ రుసుం మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయిస్తే అందరూ హర్షిస్తారు. - **తాహేర్ బాషా, ఆదోని**

మధ్య తరగతికి ప్రయోజనం కలుగుతుంది



బీపీఎస్‌తో పాటు ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఈ జీవోలతో మధ్య తరగతి వారికి భారీ ఉపశమనం లభిస్తుంది. అక్రమ కట్టడాలు తగ్గే అవకాశం కూడా ఉంటుంది. ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. - **బాలమద్దయ్య, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఆదోని**

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార ఫిర్యాదులకు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. పట్టణం లోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగ కుండా న్యాయంగా బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఎక్కువగా కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం దందాలు, అన్నదమ్ముళ్ల ఆస్తి తగదాలు వచ్చాయని తెలిపారు.

జలాశయాలు కళకళ

- శ్రీశైలానికి పోటెత్తిన వరద
- సుంకేసులకు 1.10 లక్షల క్యూసెక్కుల ఫ్లో
- తుంగభద్ర డ్యాం నుంచి 1.19 లక్షల క్యూసెక్కులు విడుదల
- నదితీర గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ



నిండు కుండలా సుంకేసుల జలాశయం

కర్నూలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రాయలసీమ జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. సీమ జీవనాడి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి డ్యాం వద్ద 2,10,920 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుండగా, ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 1,28,175 క్యూసెక్కులు, సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర నది) నుంచి 1,03,437 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గంట గంటకు వరద పెరుగుతుండడంతో పది క్రస్ట్ గేట్ల ద్వారా 1,35,325 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 65,904 క్యూసెక్కులు చొప్పున 2,01,229 క్యూసెక్కులు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సీమ కాలువలకు 31 వేలు, హంద్రీనీవా కాలువ ద్వారా 2,818 క్యూసెక్కులు, తెలంగాణ రాష్ట్రం మహాత్మగాంధీ లిఫ్ట్ ఎత్తిపోతల పథకం ద్వారా 1,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు లేకపోయినా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వరద పోటెత్తింది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ 885 అడుగుల, సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా 882.80 అడుగుల లెవల్‌లో 203.42 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను వచ్చినట్లుగా స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు వదిలేస్తున్నారు.

సుంకేసులకు వరద కళ

కర్నూలు నగరానికి 26 కి.మీల దూరంలో ఉన్న సుంకేసుల బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. గరిష్ఠ నీటి నిల్వ 1.20 టీఎంసీలే. ఎగువన నుంచి రాత్రి 8.30 గంటల సమయంలో 1.10 లక్షల క్యూసెక్కులు బ్యారేజీకి వచ్చి చేరుతోంది. 0.634 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసి డ్యాం భద్రతా దృష్ట్యా 20 గేట్లు ఎత్తి వచ్చిన వరద వచ్చినట్లుగా 1.10 లక్షల క్యూసెక్కులు దిగువ శ్రీశైలానికి వదిలేస్తున్నారు. ఎగువన తుంగభద్ర డ్యాంకు భారీగా వరద వచ్చి చేరుతుంది. 96,836 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, సామర్థ్యం 105.78 టీఎంసీలు కాగా, గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రత దృష్ట్యా 1,624.54 అడుగుల లెవల్‌లో 75.601 టీఎంసీలు నిల్వ చేశారు. 28 గేట్లు ఎత్తి 1,06,548 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఎగువ నుంచి వరద పెరుగుతుండడంతో రాత్రి 8:30 గంటల సయమానికి 1,19,613 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. మంత్రాలయం వద్ద 1,18,140 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. అలాగే మేళిగనూరు వద్ద వేదవతి నది, వాగులు కలుస్తుండడంతో ఆర్డీఎస్ వద్ద వరద పోటెత్తింది. మంగళవారం ఉదయానికి సుంకేసులకు భారీగా వరద నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి సుంకేసుల బ్యారేజీ గేట్లను పరిశీలించారు. అలాగే ఎగువన తుంగభద్ర డ్యాం నుంచి వరద పెరుగుతుండడంతో కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లోని నదితీర గ్రామాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.



క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి



విడుదల అవుతున్న నీరు

పంటల బీమాతో భరోసా



- రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధం
- కౌలురైతులు కూడా అర్హులే
- ప్రీమియం చెల్లింపునకు వరికి వచ్చేనెల 15 వరకూ
- మిగిలిన పంటలకు ఈనెల 31వ తేదీ వరకు గడువు

డోన్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకంతో రైతన్నలకు భరోసా లభిస్తోంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఆఫ్ కంపెనీ ఇండియా లిమిటెడ్ ద్వారా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులతో పంట నష్టం కలిగితే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి ఖరీఫ్ సాగులో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చాయి. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాలో అమలులోకి తీసుకురాగా అందులో నంద్యాల జిల్లా కూడా ఉంది. జిల్లాలో కొర్రలు, కందులు, సజ్జలు, మొక్కజొన్న, పత్తి, అరటి, వేరుశనగ, వరి పంటలు మాత్రమే ఈ పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పించారు. వరికి రూ.800 ప్రీమియం చెల్లిస్తే రూ.40వేలు బీమా రైతులకు దక్కుతుంది. ఎకరా కొర్రలకు రూ.160లు ప్రీమియం చెల్లిస్తే రూ.16వేలు, కందులకు రూ.140 చెల్లిస్తే రూ.20వేలు, సజ్జలకు రూ.160లు చెల్లిస్తే రూ.16వేలు, మొక్కజొన్నకు రూ.660 చెల్లిస్తే బీమా రూ.35వేలు వర్తిస్తుంది. పత్తికి రూ.1600 చెల్లిస్తే రూ.40వేలు, అరటికి రూ.2,750లు చెల్లిస్తే రూ.55వేలు, వేరుశనగకు రూ.560 చెల్లిస్తే రూ.28వేలు బీమా ఉంటుంది. వీటన్నింటికీ ఈనెల 31లోపు ప్రీమి యం చెల్లింపు చేసినవారికే ఈ పథకాలు వర్తిస్తాయి. వరికి మాత్రం రూ.800 చెల్లించేందుకు వచ్చేనెల 15వరకు గడువు ఉంటుంది. తుపాన్, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పంట నష్టపోయిన రైతులను ఆదరించడం ఈ పథకం ప్రధాన ముఖ్య ఉద్దేశ్యం. పంట నష్టం అంచనా వేసి బీమాను వర్తింపజేస్తారు. పంటలు సాగుచేసుకున్న రైతులు, కౌలురైతులు కూడా ఈ పథకంలో చేరడానికి అర్హులు అని ఏడీఏ సునీత సూచించారు.

సద్వినియోగం చేసుకోండి



పంటల బీమాను రైతులు సద్వినియోగించుకోవాలి. బ్యాంకు నుంచి పంట రుణం పొందిన రైతులు వారు రుణం తీసుకునే సమయంలో బీమా ప్రీమియం మొత్తాన్ని రైతుల నుంచి తీసుకుని వారే బీమా కంపెనికి జమ చేస్తారు. బీమా పరిహారం వచ్చిన సమయంలో ఆ బీమా మొత్తాన్ని నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకోని, పంట రుణాలు తీసుకోని వారు సచివా లయాలు, మీసేవ, రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. **- సునీత, ఏడీఏ, డోన్**

వేధింపుల కేసు నమోదు

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను వేధిస్తున్న మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. రోజూ ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నట్లు ఆ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో బస్సులు నడిపేందుకు ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు-1డిపో మేనేజర్ సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు భారీ వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. భారీ వాహనాలు నడపడంలో కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కలిగి ఉన్న డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99851 81304 నంబర్‌ను సంప్రదించాలని డిపో మేనేజర్ సూచించారు.

విశ్రాంత డీఎస్పీపై దాడి

- అప్పు చెల్లించాలని లీగల్ నోటీసు పంపడమే కారణం

ఆదోని, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్.కె.డి. కాలనీలో నివాసముంటున్న విశ్రాంత డీఎస్పీ రఘునాథచారిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన మేరకు.. సోమవారం ఉదయం వాకింగ్‌కి వెళ్లిన విశ్రాంత డీఎస్పీపై కొందరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బెంగళూరుకు చెందిన రాఘవేంద్రరెడ్డికి విశ్రాంత డీఎస్పీ కొంత డబ్బు ఇచ్చారు. తిరిగి చెల్లించాలని కోరినా రాఘవేంద్రరెడ్డి నుంచి స్పందన లేదు. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు పంపడంతో ఆగ్రహించిన రాఘవేంద్ర రెడ్డి డీఎస్పీని దూషించి, దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నల్లమలలో వేటగాళ్లపై దాడి

- ఒకరి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు
- నాటుతుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం



వేటగాడితో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలో రుద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారులు వేటగాళ్లపై దాడులు నిర్వహించినట్లు ఇన్‌చార్జి రేంజర్ ముర్తుజావలి తెలిపారు. వివరాలు.. సోమవారం రేంజ్ పరిధిలోని అహోబిళం నార్త్‌బీట్‌లో నూతల బావి రస్తా సమీపంలో అహోబిళానికి చెందిన వేటగాళ్లు నాటుతుపాకీతో వెళ్తుండగా అటవీ శాఖ సిబ్బంది దాడి చేసింది. నాటుతుపాకీతో పాటు మందుగుండు సామగ్రి అహోబిళంకి చెందిన ప్రభాకర్ అనే వేటగాన్ని అరెస్టు చేశారు. మరో ముగ్గురు వేటగాళ్లు పరారయ్యారు. వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. ప్రభాకర్‌ను ఆళ్లగడ్డ కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 15రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. పరారీలో ఉన్న ముగ్గురు వేటగాళ్లను త్వరలో పట్టుకుంటామని ఇన్‌చార్జి రేంజర్ తెలిపారు. సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు నాగహూసే నయ్య, సురేంద్రగౌడ్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

‘సీమ’కు జీవనాడి హంద్రీనీవా



మల్యాల వద్ద నీటిని పరిశీలిస్తున్నఎమ్మెల్యే జయసూర్య, గౌరు వెంకటరెడ్డి

- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య
- హంద్రీనీవా నీటి పరిశీలన
- ఏడు పంపుల ద్వారా 2,750 క్యూసెక్కుల నీటి విడుదల

నందికొట్కూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం జీవనాడి అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మల్యాల వద్ద గల హంద్రీనీవా పథకాన్ని టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా పథకానికి రూ.690కోట్లతో యుద్ధ ప్రాతిపదికన విస్తరణ చేపట్టి పనులు పూర్తిచేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీటివిడుదల చేసి నదీజలాలకు హారతి ఇచ్చాక ఇంజనీర్లు క్రమ క్రమంగా నీటిని విడుదలను పెంచుతూ వచ్చారని వాటిని పరిశీలించామన్నారు. మండలంలోని మల్యాల వద్ద గల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల నుంచి ఏడు పంపుల ద్వారా దాదాపుగా 2750 క్యూ సెక్కుల నీటిని వదిలారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూల్ జిల్లా, కడప, అనంతపురం, చిత్తూరు, జిల్లాలోని దా దాపుగా ఆరులక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామల, పట్టణాలకు తాగునీరు అందించే లక్ష్యంగా ఈ ఎత్తిపోతల నిర్మించారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు రాకతో ఈకల సాకార మైందన్నారు. కార్యక్రమంలో పగిడ్యాల మండల టీడీపీ కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

దర్యాప్తును వేగవంతం చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ధర్మస్థల హత్యోదంత ఘటనల దర్యాప్తును వేగవంతం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బి.గిడ్డమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సమాఖ్య నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు రేణుక. నగర కార్యదర్శి వి.భారతి, నాయకులు పావని, విజయ, సుధా, కోటమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.

జేసీని కలిసిన నగర పాలక కమిషనర్



జేసీ నవ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యను సోమవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నగర పాలక పరిధిలోని అభివృద్ధి పనుల గురించి కమిషనర్ జేసీకి వివరించారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డప్పు కళాకారుల సంఘల జిల్లా కార్యదర్శి కరుణాకర్, మండల గౌరవఅధ్యక్షుడు జే మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరులో సీఐటీయూ మండల కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా నేటికి డప్పు కళాకారుల పెన్షన్ ఆన్‌లైన్‌ను విడుదల చేయలేదన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఇన్‌చార్జి ఎంపీడీవో మధులతకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనను నాయకులు విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం గూడూరులో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి మౌర్యఇన్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ వేదవ్యాస్, అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పుల గోపాల్, మండల యువ మోర్చా నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశభవనంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ పోస్టరును విడుదల చేశారు. ఈ ఎస్వీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు మీ భవిష్యత్తుకు నేను గ్యా రెంటీ అని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్లు మునెమ్మ, రాజేశ్వరరెడ్డి, ఎస్‌టీ.షేక్ అహ్మద్, వాసు, సోంపల్లి కృష్ణకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సారా తయారీ మానేస్తే ఉపాధి కల్పిస్తాం: సీఐ



కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

కర్నూలు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ మానేస్తే ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎక్సైజ్ సీఐ చంద్రహస్ తెలిపారు. సోమవారం నగరంలోని బంగారుపేటలో నవోదయం కార్యక్రమంలో సారా పై కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైన ముందుకు వచ్చి ఉపాధికాశాలు కల్పించాలని కోరితే తక్షణం సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రెహనాభేగం, మెప్మా సిటి మిషన్ సీటీ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, కృష్ణ, రిసోర్స్ పర్సనులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్తులను కాపాడాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు రూరల్ జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తులను కాపాడాలని కర్నూలు 1,2డిపో ఎదుట ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ కార్మికులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ ఆర్టీసీకి సంబంధించిన విలువైన స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలోఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు విఎస్ రాయుడు, రీజనల్ కార్యదర్శి శేఖర్,ఉద్యోగులు నాగరాజు, దేవరాజు, మునెప్ప, డ్రైవర్ శేఖర్, మద్దిలేటి, జానకిరాముడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి జయంతి



పూజలందుకుంటున్న అమ్మవారు

కర్నూలు కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీగోదాదేవి జయంతి వేడుకలను నగర శివారులోని మామిదాలపాడులోగల శ్రీ గోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమేష్ భట్టార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

● పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల శ్రీలలితా పీఠంలో సోమవారం నాగుల చవితి వేడుకలు, గోదాదేవి అమ్మవారి జయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వేద పండితుడు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ పాల్గొన్నారు.



నాగుల కట్ట వద్ద పూజలు చేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ దంపతులు



అశోక్‌నగర్ శివాలయం సమీపంలో నాగుల కట్ట వద్ద భక్తుల పూజలు



టీటీడీ కల్యాణ మండపంలోని నాగుల కట్ట వద్ద భక్తుల పూజలు

చల్లగా చూడమ్మా

● జిల్లాలో ఘనంగా నాగుల చవితి ● పుట్టల వద్ద పాలు పోసిన భక్తులు



కర్నూలు కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో వచ్చేసే నాగుల చవితి వేడుకను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని వివిధ ఆలయాల్లో, ధార్మిక క్షేత్రాల్లో వెలసిన నాగుల కట్ట, నాగుల పుట్టల్లో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల తమ నివాసంలోని నాగుల పుట్ట వద్ద రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ దంపతులు పాలు పోసి, కొబ్బరికాయలు కొట్టి, సుబ్రహ్మణ్యం స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. నాగుల చవితి ప్రజలందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆకాంక్షించారు. నగరంలో సి. క్యాంపులో ఉన్న టీటీడీ కళ్యాణ మంటపం, ప్రభుత్వ వైద్య కళాశాల క్రీడా మైదానం, స్వామిరెడ్డి నగర్‌లోని ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం, అశోక్‌నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలతోపాటూ నాగుల కట్టలు ఉన్న వివిధ ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు.

ఓర్వకల్లు: గ్రామాల్లో సోమవారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓర్వకల్లు, కన్నమడకల, హుడిచర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుసేనాపురం, సోమయాజులపల్లె, శకునాల, తిప్పాయపల్లె తదితర గ్రామాల్లో మహిళలు తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: కలెక్టర్



అబ్దుల్ కలాం హెచ్‌ఎంను బదిలీ చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలన్నీ పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొని వినతులను స్వీకరించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నా పొలంలో 10 టేకు చెట్లను తొలగించారని, ఈ విషయాన్ని విద్యుత్ రూరల్ ఏఈ, లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతు మాధవరాజు వినతి పత్రం అందజేశారు.

● బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్‌బాబు, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్దపాడు బీసీ బాలుర హాస్టల్ ప్రహరి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సాయి కుమార్, అశోక్ పాల్గొన్నారు.

●నగరంలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడును బదిలీ చేయాలని కోరుతూ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

● కర్నూలు ప్రెస్‌క్లబ్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ గుప్తా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

●గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జీవో.నెం.17ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● అశ్విని సాయి రేణుకా ఎల్లమ్మ కాలనీకి తాగునీటి వసతి కల్పించాలని కాలనీవాసులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

●ఎటువంటి అర్హత లేని వారు ప్రైవేటు హాస్పిటల్స్, క్లినిక్స్‌లలో పని చేస్తున్నారని, అలాంటి హాస్పిటల్స్‌పై తనిఖీలు చేపట్టాలని నర్సెస్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దివాకర్ పాల్గొన్నారు.

● నగర కార్పొరేషన్‌లో ఉన్న రామప్రియనగర్ నందు అక్రమంగా రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి వాటిని రద్దు చేయాలని రామప్రియనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కలెక్టర్‌ను కోరారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● కమిషనర్ పి.విశ్వనాథ్



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మునెమ్మ

కర్నూలు న్యూసిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 22 అర్జీలు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి విభాగానికి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, ఆర్వో జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

● నగర పాలక పరిధిలోని 43వ వార్డులో ఇందిరాగాంధీనగర్ కొట్టం బడి స్థలాన్ని కాపాడాలని స్థానిక కార్పొరేటర్ మునెమ్మ కోరారు. కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రాముడు, కొట్టంబడి పరిరక్షణ కమిటీ సభ్యులు కే.మల్లికార్జున, ఎస్.రోశయ్య, ఎం.భాస్కర్, లోకేశ్ ఉన్నారు.

● ముజఫర్ నగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న 81,82 సచివాలయాలను తక్షణమే ఖాళీ చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. నగరపాలక కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.సాయిబాబ, కే.సుధాకరప్ప, నరసింహులు, జి.ఏసు పాల్గొన్నారు.

● లక్ష్మీనగర్ చివరి నాలుగు లైన్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.నరసింహులు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.అజ్మత్, సాబీర్, దేవదాను, బందేనవాజ్ తదితరులు పాల్గొన్నారు.

● 10 వ వార్డు చాకలివీధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని నగర పాలక కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. సీపీఎం పాబబస్తీ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ చాకలివీధిలో గత ఆరు రోజులుగా తాగునీరు రావడం లేదన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు ఎస్ఎండి.షరీఫ్, రజక సంఘం నాయకులు గురుశేఖర్, జయమ్మ పాల్గొన్నారు.

'ఎస్‌పీజీ చర్చి పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి'

కర్నూలు కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌పీజీ చర్చి పురోభివృద్ధిలో నూతనంగా ఎన్నికైన ప్రతినిధులందరూ భాగస్వామ్యం కావాలని ఎస్‌పీజీ నంద్యాల డయోసిస్ వైస్ ప్రెసిడెంట్ రెవ. పీఏ వరప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చర్చి నూతన కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఎన్నికల్లో గెలుపు ఓటములను అందరూ సమానంగా స్వీకరించి, గెలిచిన వారు బాధ్యతగా చర్చి అభివృద్ధికి, సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన కమిటీ ప్రతినిధులు భాగ్యరాజ్, ఆదామ్, డానియేలు, ఆరోగ్యస్వామి, లిల్లీ రోజ్‌లోనా, అజరయ్య, పెర్సీ ఇమ్మానియేలు, బాలయ్య, జార్జ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చీరను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



9వ వార్డులో 'తొలి అడుగు'లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోడుమూరు రూరల్, జూలై 28, (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం ముడుమలగుర్తి గ్రామంలో 'తొలి అడుగు'లో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎవరి కైనా పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. నేతన్నలతో మాట్లాడి మగ్గంపై తయారైన చీరలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, మధు, మల్లేష్, ఈశ్వరప్ప, గోపాల్, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని కె నాగలాపురం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీల్లో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కె రామాంజనేయులు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు నిర్వహిం చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరక్టర్ రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కోడమూరు షాషావలి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్, టీడీపీ నాయకులు డాక్టర్ మన్నన్ బాషా, చాంద్ బాషా, కుర్వ హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వీరకుమార్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: నగరంలోని 47వ వార్డులోని పలు కాలనీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కేఈ జగదీష్ కుమార్, న్యాయవాదులు, నాయకులు బీఎస్ రవికాంత్, మద్దేష్, గోవింద్, రాజేష్, హరినాథ్ చౌదరీ, గణేష్ సింగ్ పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డ్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, చాంద్‌బాషా, కిట్టుయాదవ్, ప్రణీత్‌రెడ్డి, కరీష్, సుబ్బు, జగదీష్ రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

●ఉభయసభల్లో మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన గౌరుచరితను నాయకులు, కాలనీ ప్రజలు సన్మానించారు.

● 36వ వార్డు వాసవీనగర్‌లో యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి లోకేశ్వరరెడ్డి, గౌండపెద్దయ్య, అంజి, మధు, పెద్దటేకుపల్లి, జవ్వాజి.గంగాధర్‌గౌడ్, పాల్గొన్నారు.

సి. బెళగల్: కొత్తకోట గ్రామంలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు తాలుకా తెలుగుయువత అధ్యకుడు కొత్తకోట హరి, టీడీపీ నాయకులు బోయపాటి శ్రీనివాసులు, తిమ్మప్ప జయపాల్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేసి డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్లు వెంటనే చేపట్టాలని పీడీఎస్‌వో ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ధర్నా చేశారు. పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటును ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400లు కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా నాయకులు సురేంద్ర, శివ, రాజేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరి కృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డీఈవో కార్యాలయంలో ఏడీ-1 అసదుల్లా ఖాన్‌కు డీటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని ఏపీ అడిషనల్ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌ను కలిసి ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు అమరావతిలో సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో విద్యార్థులకు అనేక హామీలిచ్చి వాటిని నెరవేర్చలేకపోయారని ఆరోపించారు. ఆగస్టు 12న జిల్లాలోని ప్రతి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ పతకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రంగస్వామి, థామస్, శరత్ కుమార్, నగర అధ్యక్ష కార్యదర్శి అభిరాం, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి



బి.క్యాంప్ సెక్షన్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ 23వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో బి.క్యాంప్ సెక్షన్ విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కాలనీలో విద్యుత్ పోల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని, పాతపోల్స్ తొలగించి కొత్త స్థంభాల వేయాలన్నారు. కార్యక్రమంలో అజ్మత్, మహమ్మద్‌గౌస్, బందెనవాజ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని జిల్లా సమాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు మండల తహసీల్దార్ కె.ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులు ప్రభుత్వం పథకాలు, పంటరుణాలు, పంటల బీమా, ఈ-క్రాప్ నమోదుకు అర్హత పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ మృతి

సి.బెళగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ శాలుమియ్య(47) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు మృత దేహానికి పులమాలలు వేసి నివాళి అర్పించారు, సిబెళగల్, కోడుమూరు మండలాల్లో అటెండర్‌గా 25 ఏళ్లుగా పని చేసి, ఉత్తమ అటెండర్‌గా అవార్డు అందుకున్నారని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలని వైఎస్సార్ మహిళా విభాగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని విఠల్‌నగర్ గుడ్‌షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో విజేతగా ఆశ్రమ పాఠశాల (తాండ్రపాడు) ద్వితీయ స్థానంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల (చిన్నటేకూరు), తృతీయ స్థానంలో గుడ్‌షఫర్డ్ పాఠశాల నిలిచారు. బాలికల విభాగంలో గురుకుల పాఠశాల (పత్తికొండ), గురుకుల పాఠశాల కంబలపాడు, వెల్దుర్తి పాఠశాల జట్టు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

హెపటైటిస్ వ్యాధి ప్రమాదకరం



వైద్య విద్యార్థులకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): హెపటైటిస్ వ్యాధి ఎంతో ప్రమాదకరమని, దీన్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు తెలిపారు. వరల్డ్ హెపటైటిస్‌డేను పురస్కరించుకుని సోమవారం గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం ఆధ్వర్యంలో ఓల్డ్ సీఎల్‌జీలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ వైద్య విద్యార్థులకు హైపటైటిస్ బీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ హెపటైటిస్ తీవ్రమైన కాలేయ వ్యాధి అని, వైరల్, హెపటైటిస్ గురించి ఆయన వివరించారు. అనంతరం 300 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.డి.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపల్స్ డా.సింధియా శుభప్రద, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగపు హెచ్‌వోడీ డా.జి.మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఏ.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పీజీలు పాల్గొన్నారు.

● హెపటైటిస్ బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవని, ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకుని సోమవారం ఆయన నగరంలోని శ్రీ గురుదత్త పాలీ క్లినిక్‌లో మాట్లాడారు.

కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక తాండ్రపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో వరల్డ్ హెపటైటిస్‌డే నిర్వహించారు. డాక్టర్ చంగా మోహన్ హెపటైటిస్ వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఆదోనిలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దకడబూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నుంచి కంబళదిన్నె వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్‌పీవీఎఫ్ నాయకులు ఖాజ, కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు ఆర్‌పీవీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మారుమూల ప్రాంతాల్లో కూడా రోడ్లు వేస్తామని హామీ ఇచ్చిందన్నారు. నేడు ఎమ్మిగనూరు-కంబళదిన్నె రహదారి గుంతల మయింగా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌లకు రక్షణ కల్పించాలి

గోనెగండ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి మల్లెల వంక వాగులో భూగర్భజలాలు పెరగడం కోసం నిర్మించిన చెక్ డ్యామ్‌లకు రక్షణ కల్పించాలని కోరుతూ గంజహళ్లి గ్రామానికి చెందిన మూగి నాగేంద్రప్ప సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంత మంది స్వార్థపరులు చెక్‌డ్యామ్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని రెండు రోజుల క్రితం మూడు చెక్‌డ్యామ్‌లను పడగొట్టేందకు ఎక్స్‌కవేటర్ తో ప్రయాత్నాలు చేస్తున్నపుడు కొంత మంది రైతులు అడుకోవడంతో వారు వెళ్లిపోయారని తెలిపారు. అధికార బలంతో కొంతమంది మళ్లీ అవే ప్రయాత్నాలు చేస్తున్నారు. కావునా జిల్లా కలెక్టర్ స్పందించి చెక్‌డ్యామ్‌లను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద కాలువ నిర్మించాలి



మేలిగనూరు వద్ద నదిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కౌతాళం, జూలై 28(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని మేలిగనూరు వద్ద ఉన్న తుంగభద్ర నదిపై వరద కాలువను నిర్మించి ఆంధ్ర పశ్చిమ ప్రాంత రైతులకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర నది నుంచి ప్రతి సంవత్సరం వందల టీఎంసీల నీరు వృధాగా పోతోందని నదిపై వరదకాలువను నిర్మిస్తే పశ్చిమ ప్రాంతాలైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ రైతులకు సాగు, తాగునీరు పుష్కలంగా అంది రైతులు వలస పోకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం నదిపై వరద కాలువ నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తుంగద్ర నదిలోకి దిగి నిరసన తెలిపారు.

ఎంఈవో-1గా గోవింద్ బాధ్యతలు

నందవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): నందవరం మండల ఎంఈవో-1 గా గోవింద్. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న రామాంజనేయులు గోనెగండ్లకు బదిలీపై వెళ్లారు. ఎమ్మిగనూరు జెడ్పీహైస్కూల్‌లో హెడ్‌మాస్టర్‌గా పని చేస్తున్న గోవిందుకు పదోన్నతి రావడంతో నందవరం ఎంఈవో -1కి వచ్చారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచి మండలాన్ని టాప్‌గా నిల బెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలను పాటించేలా చూస్తానన్నారు. ఈయనతో పాటు ఎంఆర్‌పీ ఉరుకుంద ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది ఒడ్డున సర్వే.నెం.1లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఈ 'నిర్మాణాల తొలగింపు పిటీషన్' హైకోర్టులో ఉండగా నిర్మాణాలు జరపడంపై మంత్రాలయానికి చెందిన గణేకంటి రఘు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేసి హైకోర్టు ఇచ్చిన ఆర్డర్స్ కాపీని ఆమెకు అందజేశారు. సర్వే.నెం.1లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. హైకోర్టులో పిటీషన్ ఉండగా.. ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని, అటువంటివి చేపడితే కోర్టు ధిక్కారణ అవుతుందన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

ట్యాంక్‌లు శుభ్రం



నీటి ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గోనెగండ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్‌లను సోమవారం బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయించినట్లు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో ఉన్న నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. గ్రామంలో అంటురోగాలు ప్రభలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం అంటురోగాలు ప్రభలే సీజన్ కావడంతో గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అలాగే పారిశుధ్య పనులు కూడా చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధికి శుద్ధి చేసిన మంచి నీటిని విడుదలు చేస్తున్నామని తెలిపారు.

అర్చకుడి మృతిపై విచారణ

కౌతాళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రము ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ ఉప ప్రధాన అర్చకుడు పూజన్న స్వామి మృతిపై రాష్ట్ర దేవాదాయ శాఖ విచారణకు ఆదేశించింది. శనివారం పూజన్న స్వామి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతిపై సోషల్ మీడియాలో పలు అనుమానాలు ఉన్నట్లు ప్రచారం కావడంతో ప్రభుత్వం ఈ కేసుపై విచారణాధికారిగా శ్రీశైలం ఈవో శ్రీనివాసులును నియమించింది. ఆయన ఆదివారం రాత్రి ఉరుకుందకు చేరుకుని అర్చకుడి కుటుంబసభ్యులను, ప్రధాన అర్చకుడితో పాటు తోటి అర్చకులను ఆలయ ఈవో విజయరాజును, వేద పండితుడు మోహన్ శర్మను విడివిడిగా విచారించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

కంది కరుణించేనా..?

- గతేడాది 66వేల హెక్టార్లలో చేసిన సాగు.. ఇపుడు 33వేల హెక్టార్లకు..
- పత్తిపై ఆశలు పెట్టుకున్న రైతన్న
- జూలై దాటితే కందికి వాతావరణం సహకరించదంటున్న శాస్త్రవేతలు



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతన్నలు ప్రతియేటా పంటలను సాగుచేసి ఏదో ఓరూపంలో నష్టాలను చవిచూస్తునే ఉన్నారు. ఒకేడాది అతివృష్టి, మరో ఏడాది అనావృష్టితో పాటు చీడ పురుగుల బారిన పడి పంటలు చేతికందక నష్టాల పాలవుతున్నారు. గతేడాది జిల్లాలోని రైతులు కంది పంటను సాగు చేసి కొంతమంది పూర్తిగా నష్టపోయారు. కనీసం పెట్టుబడి ఖర్చులకు కూడా రాలేదు. మరికొంతమంది రైతన్నలు వేసిన పంటలు చీడ పురుగుల భారిన పడడం, పంటచేతికొచ్చిన సమయంలో వర్షాలు ఏకదాటిగా పడడంతో కంది పంట పూర్తిగా నాశనమైంది. జిల్లాలో చివరి ఏడాది దాదాపు 66వేల హెక్టార్లలో రైతన్నలు కందిపంటను సాగు చేశారు. అయితే ఈ ఏడాది అధిక శాతం రైతులు పత్తి పంటపై మొగ్గు చూపారు. దీంతో ఈ ఏడాది జిల్లాలో కంది పంట సాగు తగ్గే అవకాశం లేకపోలేదని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

సగానికి సగం తగ్గిన కంది సాగు

గతేడాది 66వేల హెక్టార్లు సాగు చేసిన కంది పంటను ఈ సారి రైతన్నలు 33వేల హెక్టార్లకు తగ్గించారు. గతేడాది మిగిల్చిన నష్టాలతో దగా పడ్డ రైతన్న ఈ ఏడు నష్టాలు పూడ్చుకోవడానికి పత్తి పంటపై ఆశలు పెట్టుకున్నట్టు ఉంది.. అందుకు నిదర్శనమే ఈ సంవత్సరం కందిని సగానికి సగం తగ్గించడమని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

జూలై 31 దాటితే కందికి గడ్డు సమయం: జిల్లాలో ఈ ఏడాది కంది సాగు దాదాపు 33 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జూలై 31 తర్వాత.. మారే వాతావరణ పరిస్థితులను బట్టి కందికి పీడ, చీడ చేరే అవకాశం ఎక్కువుంటుందని శాస్రవేత్తల అంచనా.. ఒక ఎకరాలో కంది పంటను సాగుచేసేందుకు 4కేజీల కందులు అవసరం అవుతాయి. ఒక ఎకరాకు సగటు దిగుబడి 6-7క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంది. ఒక ఎకరా కంది పంట సాగుకు దాదాపు రూ.25వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ ఏడాది కంది పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.7,755 మద్దతు ధర కల్పించింది.

వర్షాధారం కింద అనువైన కంది సాగు రకాలు: జిల్లాలో చాలా మంది రైతులు వర్షాదారం కిందనే కంది పంటను సాగుచేశారు. వర్షాధారం కింద సాగు చేయాలనుకునే రైతులు పీ.ఆర్.జీ 176(పాలెం కంది), టీ.ఎస్.3ఆర్ రకాలను సాగుచేసుకోవచ్చు. పీ.ఆర్.జీ 176, టీ.ఎస్. 3ఆర్ రకాలు 130 రోజుల నుంచి 135 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు 6-7 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

నీటి వసతి కింద సాగు చేయు రకాలు: ఎల్.ఆర్.జీ -152, జీ.ఆర్.జీ -152 రకాలను సాగు చేసుకోవచ్చు. ఎల్ఆర్‌జీ రకం ఎకరాకు 8 నుంచి 10క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు 155-160 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఇందులో జీఆర్‌పీ రకం ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు 160-170రోజుల్లో పంట చేతికొస్తుంది.

విత్తన శుద్ధి: ఎకరా కంది పంటను సాగు చేసేందుకు 4 కేజీల కంది అవసరం అవుతోంది. కంది పంటను సాగు చేసే సమయంలో తప్పకుండ విత్తన శుద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. కిలో విత్తనానికి 10గ్రాముల రైజోబియంతో విత్తన శుద్ధి చేసుకోవాలి అలాగే ఎకరాకు 18కిలోల యూరియాతో పాటు 1000 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ను వినియోగించాలి. ముందుగా సాగు చేసిన కంది పంట ప్రస్తుతం శాఖీయ దశలో ఉంది. ఈ దశలో ఎండు తెగులు సోకి మొక్క పూర్తిగా కాని, సగం మొక్కగాని ఎండిపోయే ప్రమాదం ఉంది. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోదుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. వీటి నివారణకు ట్రైకోడెర్మ విరిడి ఒక కి.లో లేడాపర్ ఆక్సీక్లోరైడ్ 500 గ్రాములు, 20 కి.లో సేంద్రీయ పదార్థంలో కలిపి మొక్కల పక్కన చల్లి నివారించుకోవచ్చు.

ఫ్లీ పెంకు పురుగు నివారణ: కందిపంట తొలిదశలో ఫ్లీ పెంకు పురుగు పంటను ఆశించి నాశనం చేస్తుంది. ఈ పురుగు ఎదిగిన ఆకులను తిని పంటకు నష్టం కలిగిస్తాయి. ఆకులపై చిన్న రంధ్రాలను ఏర్పరుస్తాయి. దీని నివారణకు వేప నూనె 5 మి.లీ/ లీ. తో పాటు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ/లీ కు కలిపి పిచికారి చేసుకోవాలి.

పూర్తిగా నాశనం..



గతేడాది రెండు ఎకరాలను కౌలుకు తీసుకొని కంది పంటను సాగుచేశాను. దాదాపు 50వేల వరకు పెట్టుబడి పెట్టాను. సకాలంలో వర్షాలు రాకపోవడం, కంది పంటను పురుగులు పూర్తిగా నాశనం చేయడంతో పంట ఏమాత్రం చేదికందలేదు. దీంతో నాకు రూ.50వేలకు పైగా నష్టం వచ్చింది. అందుకే ఈ ఏడాది పత్తి పంటను సాగుచేశాను.

● శ్రీరాములు, రైతు, కె.తిమ్మాపురం

సలహాలు పాటించడం ఉత్తమం



కంది పంట సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో ఎంతో ఉత్తమం. కంది పంటకు పూత ఎక్కువగా ఉండడం వల్ల పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సార్లు రైతులు ఎన్ని పురుగు మందులు పిచికారి చేసినా కంది పంటకు పురుగు తగ్గదు. అందుకే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి సరైన సమయంలో సరైన మందులను పిచికారి చేస్తే మంచి దిగుబడిని సాధించవచ్చు. కంది సాగు చేసే రైతులు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలను సంప్రదిస్తే రైతుల పొలాల దగ్గరకే వెళ్లి సూచనలు, సలహాలు ఇస్తారు.

● డాక్టర్. రాఘవేంద్ర చౌదరి,
బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- నాగులకట్టల వద్ద ప్రత్యేక పూజలు
- నైవేద్యం సమర్పించిన భక్తులు



నాగభరణికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి



కోసిగిలో శివాలయంలో నాగదేవతకు పూజలు చేస్తున్న మహిళలు

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య నాగుల కట్టకు పఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం శ్రావణమాసం తొలి సోమవారం నాగుల చవితిని పురస్కరించుకుని పూర్వపు పీఠాధిపతుల బృందావనాల వద్ద ఉన్న నాగులకట్టకు వెండితొడుగుతో అలంకరించిన నాగప్రతిమకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. పూర్ణబోధ పూజా మందిరంలో సంస్థాన పూజలో రజత నాగప్రతిమకు విశేష అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. నాగులచవితిని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు కనులారా తిలకించి ఆనంద పరవశితులయ్యారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నాగుల పుట్టకు పాలు పోసి పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు.

కోసిగిలో: మండల కేంద్రమైన కోసిగిలో శ్రావణమాసంలో మొదటి సోమవారం నాగులచవితి పండుగ సందర్భంగా పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోసిగిలోని నాల్గవ వార్డులోని ఈశ్వరస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి, మార్కెండేయస్వామి ఆలయాల్లో మహిళలు, భక్తులు నాగులపుట్టకు, నాగదేవతామూర్తులకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగా పెళ్లయిన దంపతులు కోసిగయ్య గుడిలో నాగపుట్టలకు పాలు పోసి పూజలు చేశారు.

స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రా లయం, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహరించారు. శ్రావణమాస తొలి సోమవారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు.

తుంగభద్ర నదికి భారీగా వరద



తుంగభద్ర వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోసిగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా వరద నీరు పోటెత్తింది. సోమవారం ఆర్డీఎస్ ఆనకట్టను తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ హనుమంతరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఏఈ రవిప్రసాద్‌లు ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద తుంగభద్ర నది వరద ఉధృతిని పరిశీలించారు. తుంగభద్ర డ్యాం నుంచి 27 గేట్లు ఎత్తి 1,15,759 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అయిందని, అయితే నదీతీర ప్రాంతాల ప్రజలు ఆందోళనలు చెందవద్దని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు తుంగభద్ర నదిలోకి వెళ్లకూడదని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని సూచించారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద వీఆర్వో, ఎల్లెల్సీ లస్కర్లతో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

కారు, మోటారు సైకిల్ ఢీ..

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన, హాలహర్వి గ్రామాల మధ్య మోటారు సైకిల్, కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఈ రోడ్డు ప్రమాదం సోమవారం రాత్రి జరిగింది. చిలకలడోన గ్రామానికి చెందిన బోయ మహానంది ఎమ్మిగనూరు నుంచి మోటారు సైకిల్‌పై చిలకలడోనకు వస్తుండగా.. మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మోటారు సైకిల్‌పై వస్తున్న మహానందికి తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. నందవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



నందవరం సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ డిమాండ్ చేశారు. సోమవారం నందవరంలోని సచివాలయం ముందు నిరసన కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు గిడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రామలింగుడు, ముని, ఈరన్న, నరసింహులు, చెన్నప్ప పాల్గొన్నారు.

కార్పొరేటీకరణకు ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్

ఎమ్మిగనూరు జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యను పూర్తి స్థాయిలో కార్పొరేటీకరణ చేయటానికి ప్రయత్నిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం హనుమాపురం గ్రామ సమీపంలో ఉన్న నలంద బీఈడీ కళాశాల అవరణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా 48వ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్, మాజీ రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు మాట్లాడుతూ 2019లో పార్లమెంట్ సమావేశంలో చర్చించకుండా జాతీయ విద్యావిధానం 2020 తీసుకొచ్చారన్నారు. ఇందులో కాషాయీకరణ, వాణిజ్యీకరణ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీలో ఏ విదానాన్ని అమలు చేసిందో అదేవిధానాన్ని అమలు చేయటం ఎంతవరకు సమంజసమోనన్నారు. నారా లోకేష్ యువగళంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమయ్యారన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను అపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని 27 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సాయి ఉదయ్, జిల్లా కార్యదర్శిగా రంగప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉదయ్, అమర్, అంజి, సంయుక్త, సహాయ కార్యదర్శులుగా రంజిత్ రెడ్డి, శశికుమార్, అబుబక్కర్, లక్ష్మినారాయణలను ఎన్నుకున్నారు.

మట్టి తొలగించేందుకు చర్యలు

ఎమ్మిగనూరు జూలై28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వరద కాలువల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన మట్టిని, మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో వరదకాలువల్లో పేరుకుపోయిన మట్టితొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రధాన మురుగు కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పారిశుద్య పనులు కూడా ఎప్పటికప్పుడు చేపడుతున్నామని తెలిపారు.

భూకబ్జాపై సబ్‌కలెక్టర్ ఆరా

- పూర్తి రికార్డులతో సహా రావాలి
- తహసీల్దార్‌కు తెలిపిన సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో దళితుల భూమిని బినామీ పేరుతో కోసిగి మండల ప్రముఖ వైసీపీ నాయకుడు గంగాధర్‌స్వామి అనే బినామీ వ్యక్తి పేరును ఆన్‌లైన్‌లో చేర్చడం జరిగిందని బాధితుడైన దళిత యువకుడు మౌలాలి ఇచ్చిన సమాచారం మేరకు 'ఆంధ్రజ్యోతి'లో భూకబ్జా చేశారన్న కథనానికి స్పందించిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ విషయం గురించి ఆరా తీశారని కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. కడిదొడ్డి గ్రామ సర్వే.నెం.25/ఏ1లో రెండెకరాల 40 సెంట్ల భూమికి సంబంధించి పూర్తి రికార్డులతో కలిసి ఫిర్యాదు చేసిన దళిత యువకుడు, వీఆర్వో, తహసీల్దార్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి రికార్డులతో హాజరు కావాలని సబ్ కలెక్టర్ తెలిపారని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. అయితే ఆంధ్రజ్యోతిలో భూకబ్జా అనే కథనంతో కోసిగి మండలంలో వైసీపీ నాయకునికి టెన్షన్ మొదలై అధికారులతో రాయబారాలకు దిగినట్లు సమాచారం.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆపాలంటే మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ అన్నారు. సోమవారం మంత్రాలయం రాఘవేంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై నివారణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు మహిళా చట్టాలు, బాల్యవివాహాలు, మద్యపానం, గుట్కా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉన్నత భవిష్యత్తును మార్చుకునేందుకు ఇది అనువైన వయస్సు అని, ఇక్కడే జీవితం మలుపు తిరుగుతుందని, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. చట్టాలపై నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి శాంతిభద్రతలకు విద్యార్థులు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

కోసిగి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఓ గ్రామానికి చెందిన మహిళపై ఈ నెల 19వ తేదీన అదే గ్రామానికి చెందిన తలారీ రాజేష్ అనే యువకుడు అత్యాచారయత్నం చేశాడు. మహిళ మూత్రవిసర్జనకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. తనపై అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని మహిళ కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



గర్భిణులకు అవగహన కల్పిస్తున్న వైద్యాధికారిణి ఫిర్దోస్

పెద్దకడబూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులో సోమవారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో గర్భిణులకు వైద్యాధికారిణి ఫిర్దోస్ క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్, పొగాకు, ఆల్కహాల్ అలవాటు ఉన్నవారికి 60ఏళ్లు దాటిన తరువాత క్షయ వ్యాధి లక్షణాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. 60ఏళ్లు పైబడిన వారు గళ్ల పరీక్ష తప్పకుండా చేయించుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఎక్స్‌రే తీయించుకోని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి ఉన్నవారికి ప్రభుత్వం నెలకు రూ. 1000ల ఆర్థికసాయం, మందులను ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆదినారాయణ, భాస్కర్, సుశీలమ్మ, కిషోర్, లక్ష్మి, నరసమ్మ పాల్గొన్నారు.

సేవ పేరుతో దోపిడీ

- అనధికార సీఎంఎస్ సెంటర్ల నిర్వాకం
- నిరక్షరాస్యుల ఖాతా నుంచి నగదు మళ్లింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు


మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఆలూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార కామన్ మాన్ సర్వీస్ (సీఎంఎస్) సెంటర్ల నిర్వాహకులు అమాయకులను దోచుకుంటున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వివిధ సేవల నిమిత్తం వచ్చే నిరక్షరాస్యులు, వృద్ధుల నుంచి ఇన్‌స్టా పే ద్వారా ఆన్‌లైన్‌లో అధిక మొత్తంలో నగదును బాధితులకు తెలియకుండా కాజేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు డ్రా చేసే సమయంలో బాధితులకు తెలియకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో నిరక్షరాస్యులు, వృద్ధులు నష్టపోతున్నారు.

పోలీసులకు బాధితుల ఫిర్యాదు..

నష్టపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నాలుగు రోజుల క్రితం ఆలూరు ఎస్‌ఐ మహబూబ్‌బాషా ఆలూరులో మెయిన్ బజారులో ఉన్న సీఎంఎస్ (ఇన్‌స్టాపే) సెంటర్‌లో విచారణ చేసి, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేంద్రం నిర్వాహకుడు డబ్బులు అదనంగా తమ ఖాతా నుంచి డ్రా చేసినట్లు బాధితులు హనుమంతు, సురేష్ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్‌ఐ నిర్వాహకుడిని విచారించి నగదును రికవరీ చేస్తామన్నారు. ప్రజలను మోసం చేస్తే సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆధార్, ఓటీపీ నెంబర్లు చెప్పొద్దు

హాలహర్వి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి, ఆధార్, బ్యాంకు ఖాతా, ఓటీపీ నంబర్ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని ఎస్‌ఐ మారుతి సూచించారు. సోమవారం మాట్లాడుతూ ఇప్పటికే హాలహర్వి స్టేషన్‌లో చాలామంది సైబర్ మోసాల బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. అనవసర యాప్‌లతో ఖాతాలో డబ్బు మాయమవుతుందని, జాగ్రత్త పడాలని పేర్కొన్నారు

ఎమ్మెల్యే ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు


ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న విద్యుత్ అధికారులు

మద్దికెర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని బస్టాండు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ మహ్మద్ రఫి సోమవారం మార్పించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే శ్యాం బాబుకు స్థానికులు విన్నవించడంతో స్తంభాన్ని వెంటనే మార్చాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు సూచించారు. సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్ రూ.2.70లక్షలు చెల్లించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేశారు. లైన్‌మెన్ వెంకటరమణ, పంచాయతీ సభ్యులు బండారు అంజనేయులు ఉన్నారు.

వైద్యులు ఉండేలా చూడాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లలో సెలవు దినాల్లోనూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం అర్బన్ సెంటర్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు ఉండరని, దీంతో ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని ఫిర్యాదు చేశారు.


ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నానో ఎరువుతో పంటకు మేలు

ఆలూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువుతో పంటకు మేలని ఏవో వెంకటేశ్వరగౌడ్ తెలిపారు. సోమవారం ఆలూరు రైతుసేవా కేంద్రంలో యూరియా బస్తాలను పరిశీలించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నానో యూరియా, డీఏపీని అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు ఆంజనేయ, రైతులు జయరాం, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


ఎరువులను పంపిణీ చేస్తున్న ఏవో

కౌలు కార్డులు ఇవ్వాలి

ఆస్పరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని సీపీఐ నాయకులు విరుపాక్షి, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం కైరుప్పల, బిల్లేకల్, ముత్తుకూరు, నగరూరు, ములుగుందం గ్రామ సచివాలయాల వద్ద ధర్నా చేసి అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు. దేశానికి అన్నంపెట్టే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కౌలు రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రమేష్, రామంజిని, హనుమంతు, జైరాముడు, నరసప్ప, కృష్ణ, ఉన్నారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎస్‌ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్

ఆదోని టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి తాగునీరు అందించే బసాపురం చెరువుకు ఎల్ఎల్‌సీ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ చెరువులో నీరు అడగంటడంతో తాగునీరు వంద్రుతో వస్తోందని ఫిర్యాదులు వచ్చాయన్నిరు. ప్రజలు తాగుటనటికి కాచి చల్లార్చి వడపోసి తాగాలని సూచించారు. కొత్త నీటిని జాగ్రత్తలు తీసుకోకుండా తాగితే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.


పంపింగ్ అవుతున్న తాగునీరు

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఉమాపతినాయుడు

ఆదోని, జూలై28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని గౌలిపేట, చిన్నశక్తి గుడి ప్రాంతాల్లో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కుటుంబంలోని విద్యార్థులం దరికీ తల్లికి వందనం వచ్చిందని, ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ జమ చేసినట్లు మహిళలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. సాకేరే మారుతీరావు, శ్రీకాంత్‌రెడ్డి, రంగస్వామినాయుడు, గుడిసె శ్రీరాములు, జి.శంకర్ పాల్గొన్నారు.

రెగ్యులర్ సిబ్బందిని నియమించాలి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని సీపీఎం నాయకులు లక్ష్మన్న, గోపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల బదిలీ చేసి, తిరిగి మరొకరిని నియమించలేదన్నారు. ఇన్‌చార్జిల కారణంతో విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీ, కొత్త రేషన్ కార్డులు, పాతవాటిలో పేర్ల మార్పు, పట్టాల పంపిణీ, ఆస్తిపన్నుల వసూళ్ల నెమ్మదించాయన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ ఎడవలి ఆనంద్

మద్దికెర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని మద్దికెర సొసైటీ చైర్మన్ ఎడవలి ఆనంద్ అన్నారు. సోమవారం చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు చిన్న పెద్దయ్య, సుంకులప్ప ప్రమాణ స్వీకారం చేశారు. అర్హతగల రైతులకు రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, గూడూరు ధనుంజయుడు, చంద్రశేఖర్‌గౌడు ఉన్నారు.

కౌలుచట్టాన్ని అమలు చేయాలి

పత్తికొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కోసం కౌలు చట్టాన్ని అమలు చేయాలని రైతు సంఘం నాయకుడు సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నహుల్తి, దేవనబండ, పందికోన సచివాలయ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. గుర్తింపుకార్డులు ఇచ్చి షరతులు లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయా లన్నారు. పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుమంచి, కారన్న, రామాంజనేయులు సిద్ధలింగప్ప ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

4న తాగునీటిపై సదస్సు

పత్తికొండటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, దివంగత ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆగస్టు 4న సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పాచరేడే వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈశ్వర్‌రెడ్డి సమస్య పరిష్కరించారన్నారు

చంద్రబాబుతో దూదేకులకు న్యాయం

దేవనకొండ, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): సీఎం చంద్రబాబుతో రాష్ట్రంలోని దూదేకు ల న్యాయం చేకూరుతుందని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నేలతలమర్రి రసూల్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన దూదేకులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.


రసూల్

బైపాస్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు తీరవు

ఆదోని టౌన్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మిగనూరు - ఆలూరు బైపా స్‌తో పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు పోయే అవకాశం లేదని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్య దర్శి నూర్ అహ్మద్ అన్నారు. సోమ వారం మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకల కోసమే ఈ హైవే పనికి వస్తుందన్నారు. ఆదోనిలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే తప్ప ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని, ఎమ్మెల్యే రహదారుల విస్తరణకు నిధులు తేవాలలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణంలో నాణ్యత లోపం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేయాలని కేంద్రానికి లేఖ రాశానన్నారు.

మహిళలకు పెద్దపీట


ప్రజలకు పథకాలను వివరిస్తున్న నాయకుడు రమేష్

హాలహర్వి, జూలై28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేశారని టీడీపీ నాయకుడు రమేష్ అన్నారు. సోమవారం మండలం లోని చింతకుంట, సిరిగాపురం, హాలహర్వి గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. సర్పంచ్ మల్లికార్జున, నాయులు చిన్నికృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఆలూరు రూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని వ్యవసాయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేష్, సీపీఐ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయ వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందించారు. పంటనష్ట పరిహారం చెల్లించాలని, బీమా వర్తింపజేయాలన్నారు. గోపాల్, బాషా, రంగన్న పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

మద్దికెర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు నాగరాజు, మదనం తపురం హనుమన్న, కోదండరాముడు కోరారు. సోమవారం మద్దికెర, బసినే పల్లి గ్రామాల సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు.

ఇల్లు నిర్మించుకోకపోతే చర్యలు

మద్దికెర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోకపోతే రద్దు చేయడమే కాకుండా చర్యలు తప్పవని హౌసింగ్ డీఈ ఆదినారాయణ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఇల్లు నిర్మించుకోని వారికి నోటీసులు జారీ చేశారు. బేస్‌మట్టం వరకు 103 మంది, లెంటల్ లెవెల్‌లో 80 మంది, రూఫ్‌లెవల్‌లో 31 మంది లబ్ధిదారులు నిర్మాణాలను నిలిపివేశారన్నారు. మరో 214 మందికి పక్కా గృహాలు మంజూరైనా నిర్మించుకోలేదని, ఇలాగే ఉంటే గృహాలతో పాటు పట్టాలు, రుణాలను రద్దు చేస్తామన్నారు. ఏఈలు ఉమాకాంత్, విష్ణు ఉన్నారు.


నోటీసులు ఇస్తున్న హౌసింగ్ డీఈ

స్నేహితుడి కుటుంబానికి సాయం

తుగ్గలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి స్నేహితులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. తమతో కలిసి పత్తికొండలో డిగ్రీ చదివిన తలారి రాముడు మృతి చెందాడని తెలిసి మిత్రులు కానిస్టేబుల్ రమేష్, మల్లేష్, చెన్నకేశవరెడ్డి రూ.53వేలు నగదును మిత్రుడి భార్య సావిత్రికి అందించారు. మిత్రుడి మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మిత్రులు రంగరాజు, తదితరులు ఉన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

ట్యాంకు శిథిలం.. తాగునీరు కలుషితం


మారెళ్ల గ్రామంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

తుగ్గలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని మారెళ్లలో దాదాపు 2,500 మంది పైగా జీవిస్తున్నారు. రిఇకి తాగునీరందించేందుకు 50 ఏళ్ల క్రితం ట్యాంకు నిర్మించారు. ట్యాంకు నుంచి పైపులైన్లు వేశారు. కాగా ట్యాంకు శిథిలావస్థకు చేరండంతో కొళాయిలకు వచ్చేనీరు కలుషితంగా వస్తోందని, వాసన ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని తాగి ఇప్పటికే కొందరు మరణించారని నూతన ట్యాంకును నిర్మించాలని కోరుతున్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


వృద్ధుడి సమస్యను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, జూలై28(ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను వేగంఅ పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించి లబ్ధిదారులను సంతృప్తిరచాలని అధికారులకు సూచించారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకూడదన్నారు. ఏవో వసుంధర, డీఎల్‌పీవో తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఏడీఏ బాలవర్ధిరాజు, డీటీ రుద్రగౌడ్ పాల్గొన్నారు.

సారాకు స్వస్తి పలకాలి

ఆలూరు, జూలై28 (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి స్వస్తి పలకాలని ఆలూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ లలితదేవి సూచిం చారు. సోమవారం నెరణికి తండా లో నవోదయం-2.0లో భాగంగా గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తయారీ, విక్రయం నేరమన్నారు. ఈ వృత్తిని వీడి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకోవాలని కోరారు. హొళగుంద ఎస్‌ఐ గురజాల దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ లలితాదేవి

కళాశాల వద్ద హాస్టల్ ఏర్పాటు చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సమీపంలోనే బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థినులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. హాస్టల్ కళాశాలకు 3 కి.మీ.ల దూరంలో ఉందని రాకపోకలకు విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంల లేదని ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

'తల్లికి వందనం'తో విద్యార్థులకు మేలు

ఆలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' ద్వారా కుటుంబంలోని పిల్లలందరికీ రూ.13 వేలు జమ చేసిందని టీడీపీ నాయకుడు డా.నెట్టప్ప, వెంకన్న అన్నారు. సోమవారం పట్టణంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలును తెలుసుకున్నారు. చిన్నారులు మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దురంగ, గూళ్యం రామాంజినేయులు, హనుమప్ప, అంజి, రాముయాదవ్ పాల్గొన్నారు.


లోకేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న చిన్నారులు

రీ సర్వేలో రైతులకు న్యాయం చేస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు తహసీల్దార్ శోభా సువర్ణమ్మ



ఆలూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో రైతులు నష్టపోకుండా న్యాయం చేస్తానని ఆలూరు తహసీల్దార్ శోభా సువర్ణమ్మ తెలిపారు.

ప్రశ్న: గతంలో చేసిన రీ సర్వేతో తమ వారసత్వ భూములు ఇనాం భూములుగా చూపుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: మండలంలోని తుంబళబీడు, కమ్మరచేడు, ముద్దనగేరి, కురువళ్లి, కరిడిగుడ్డం, మరకట్టు గ్రామాల్లో గతంలో రీ సర్వే చేశారు. అయితే 700 మంది రైతుల వారసత్వ భూములు ఇనాంగా చూపుతున్నాయి. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించాం.

ప్రశ్న: రేషన్ డీలర్లు కొందరు దుకాణాలు తెరవడంలేదనే ఫిర్యాదులు ఉన్నాయి?

జవాబు: నిబంధనల మేరకు రేషన్ దుకాణాలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు నెలలో 15 రోజులపాటు తెరిచి ఉంచాలి. 15 నుంచి ఇంటి వద్దకు వెళ్లి వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరఫరా చేయాలి. అలా చేయని డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు త్రీమెన్ కమిటీలో మీరు కూడా సభ్యులుగా ఉన్నారు. ఒక్కసారైనా తనిఖీ చేశారా?

జవాబు: ఇప్పటి వరకు చేయలేదు. ఇక నుంచి వారానికి ఒక్కసారి ఎంఈవో, ఎంపీడీవోతో కలిసి తనిఖీ చేస్తాం. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చూస్తాం.

ప్రశ్న: భూ వివాదాలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గ్రామాల్లో భూ వివాదాలు వస్తే ఇరువర్గాలతో చర్చించి, రికార్డుల మేరకు ఇద్దరికీ న్యాయం జరిగేలా చూస్తాం.